RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# జెన్‌జీకి విద్యాశాఖ పగ్గాలు అప్పగించాలి

**యువతకు అవకాశం ఇచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 27 (వార్త సంధ్య) :** తెలంగాణలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలంటే ముందుగా జెన్‌జీ ప్రతినిధికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి, అనంతరం విద్యాశాఖ మంత్రిగా నియమించాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కొవ్వత్తుల ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2029లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే జెన్‌జీకి కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవి వచ్చేలా సిఫారసు చేస్తామని చెప్పడాన్ని ప్రస్తావిస్తూ, భవిష్యత్ హామీల కంటే ప్రస్తుతం రాష్ట్ర విద్యా వ్యవస్థను గాడిలో పెట్టడంపై దృష్టి పెట్టాలని అన్నారు. రాష్ట్రంలోని గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, తాగునీరు, మౌలిక వసతుల కొరతతో విద్యార్థులు రోడ్డెక్కి నిరసనలు చేపడుతున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో యువతకు అవకాశం కల్పిస్తూ జెన్‌జీ ప్రతినిధిని ఎమ్మెల్సీగా నియమించి, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగించడం ద్వారా ముఖ్యమంత్రి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని యెర్రా కామేష్ సవాల్ చేశారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాత అవకాశాలు కల్పిస్తామనే మాటల కంటే, ప్రస్తుతం ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడుతున్నప్పటికీ, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు ప్రాణాలు కోల్పోయి శవాలుగా ఇళ్లకు చేరుతున్న పరిస్థితి అత్యంత దురదృష్టకరమని అన్నారు. వెంటనే విద్యాశాఖను యువత చేతుల్లో పెట్టి విద్యా వ్యవస్థను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో వినయ్, చెనిగరపు నిరంజన్ కుమార్, వంశీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కులు కట్ చేస్తానంటూ బెదిరింపులు..!

**రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో లెక్చరర్‌పై విద్యార్థుల ఆగ్రహం**

**అవినీతి, వేధింపుల ఆరోపణలు**

**సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 27 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెటలర్జీ విభాగం లెక్చరర్ మల్లికార్జున్‌పై విద్యార్థులు తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, దీనిపై ఎవరైనా ప్రశ్నించినా లేదా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇంటర్నల్ మార్కులు కట్ చేస్తామని, కళాశాల నుంచి సస్పెండ్ చేయిస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై స్పందించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు, విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తూ వారి విద్యా భవిష్యత్తుతో ఆటలాడుతున్నారని మండిపడ్డారు. మార్కుల పేరుతో బెదిరింపులకు పాల్పడడం, విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడం వంటి ఆరోపణలు అత్యంత తీవ్రంగా పరిగణించాల్సిన అంశాలని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి, నిజానిజాలు వెలికితీసి సంబంధిత లెక్చరర్‌పై తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కళాశాల యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ టౌన్ కార్యదర్శి కొప్పుల శశిధర్, టౌన్ ఉపాధ్యక్షుడు దేవరపల్లి నిఖిల్, జాయింట్ సెక్రటరీ దొమ్మేటి సాయి నిఖిల్, నాయకులు సంజయ్, సంతోష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్వాడి భవనం ప్రారంభం

**చిన్నారుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యా వాతావరణమే లక్ష్యం**

**పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 27 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని చింతిర్యాల గ్రామపంచాయతీ పరిధిలోని కట్టంవారి గూడెంలో రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అంగన్వాడి భవనాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. నాణ్యమైన ప్రాథమిక విద్యతో పాటు పోషకాహారం, సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, మండల నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్నపాటి వర్షానికే రోడ్డు అస్తవ్యస్తం

**బురదలో ఇబ్బంది పడుతున్న స్కూల్ చిన్నారులు**

**రాంపురం గ్రామంలో రోడ్డు కోసం ప్రజల నిరీక్షణ**

**ప్రమాదాలకు నిలయంగా మారిన గ్రామ ప్రధాన రహదారి**





**చుంచుపల్లి, జూలై 27 (వార్త సంధ్య) :** చిన్నపాటి వర్షం కురిసినా చాలు... చుంచుపల్లి మండలం రాంపురం గ్రామంలోని ప్రధాన రహదారి పూర్తిగా బురదమయంగా మారుతోంది. రోడ్డు అంతా గుంతలు, బురదతో నిండిపోవడంతో గ్రామస్తులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే చిన్నారులు జారిపడి కిందపడుతున్న ఘటనలు తరచూ చోటు చేసు కుంటు న్నాయి. వర్షపు నీరు రోడ్డు మీద నిల్వ ఉండటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, నడిచే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామంలో కనీసం ప్రయాణానికి అనువైన రోడ్డు కూడా లేక పోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజలు పలు మార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యను వివరించినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని చెబుతున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవు తోందని, విద్యార్థులు, వృద్ధులు, గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. ఇప్ప టికైనా అధికారులు స్పందించి రాంపురం గ్రామంలో నాణ్యమైన సీసీ రోడ్డు లేదా బీటీ రోడ్డు నిర్మించి ప్రజల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# అంగన్వాడీ చిన్నారులకు యూనిఫాముల పంపిణీ

**చిన్నారులకు స్వయంగా అల్పాహారం తినిపించిన కార్పొరేటర్**

**ప్రతి చిన్నారిని సొంత బిడ్డలా చూసుకోవాలని సూచన**

**గర్భిణీలు, బాలింతల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**





**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 27 (వార్త సంధ్య) :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60వ డివిజన్ కూలీలైన్ 12వ అంగన్వాడీ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూనిఫాం పంపిణీ కార్యక్రమంతో పాటు అల్పాహార కార్యక్రమాన్ని కార్పొరేటర్ భీమ శ్రీవల్లి శ్రీధర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆమె చిన్నారులతో ఆప్యాయంగా మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసు కున్నారు. చిన్నారులతో సరదాగా మాట్లాడుకుంటూ వారికి స్వయం గా అల్పాహారం తినిపించి, వారి ఆరోగ్యం, ఆహారపు అలవాట్లు, చదువుపై ఆసక్తి గురించి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం అందజేస్తున్న నూతన యూనిఫాములను చిన్నారులకు పంపిణీ చేశారు. యూనిఫాములు అందుకున్న చిన్నారులు ఆనందం వ్యక్తం చేయగా, తల్లిదండ్రులు ప్రభుత్వానికి, కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులతో ప్రత్యేకంగా మాట్లాడిన కార్పొరేటర్ భీమ శ్రీవల్లి శ్రీధర్ అంగన్వాడీ కేంద్రం ద్వారా అందుతున్న అల్పాహారం, పోషకాహారం, గుడ్లు తదితర సంక్షేమ సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు, లోపాలు లేదా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు ఎలాంటి ఆటంకాలు లేకుండా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సమావేశమైన ఆమె ప్రతి చిన్నారిని తమ సొంత బిడ్డలుగా భావించి ప్రేమతో, శ్రద్ధతో చూసుకోవాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించరాదని, ప్రతి రోజు కేంద్రానికి వచ్చే పిల్లలకు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలు, ఆరోగ్య సేవలు సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసు కోవాలని ఆదేశించారు. వారి పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించినా, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించినా బాధ్యు లపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తెలం గాణ ప్రభుత్వం మహిళలు, చిన్నారుల సంక్షేమానికి అత్యంత ప్రాధా న్యత ఇస్తోం దని పేర్కొన్న కార్పొరేటర్, అంగన్వాడీ కేంద్రాలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అధికారులు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సమగ్రాభివృద్ధికి 1.95 కోట్ల పనులకు శ్రీకారం

**మౌలిక వసతుల కల్పనతో నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతాం**

**కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**





**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 27 (వార్త సంధ్య) :** సుజాతనగర్ మండల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం సుజాతనగర్ మండల పరిధిలోని కార్పొరేషన్ డివిజన్‌లో రూ.1.95 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు, బస్ షెల్టర్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, సుజాతనగర్ కార్పొరేషన్‌లో విలీనమైన తర్వాత గ్రామాల రూపురేఖలు మారేలా కోట్లాది రూపాయల అభివృద్ధి నిధులను మంజూరు చేయించామని తెలిపారు. ప్రతి గ్రామంలో తాగునీటి సౌకర్యం, వీధిదీపాలు, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సుజాతనగర్ నుంచి శివాలయం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. అలాగే సుజాతనగర్‌లో మున్సిపల్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సింగభూపాలెం చెరువుకట్ట అభివృద్ధికి రూ.5.50 కోట్ల నిధులు మంజూరయ్యే దశలో ఉన్నాయని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ (న్యాక్) కేంద్రాన్ని మంజూరు చేయించామని చెప్పారు. నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. పార్టీలకతీతంగా ప్రతి వర్గం ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా పనిచేస్తున్నామని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల సాధనలో నిరంతరం కృషి చేస్తూ, అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సొసైటీ అధ్యక్షులు మండే హనుమంతరావు, టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, మున్సిపల్ కమిషనర్ సుజాత, కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ భారతి, ఏఓ నర్మద, విద్యుత్ శాఖ ఏఈ కిషన్, సీపీఐ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ సౌకర్యం వెంటనే ప్రారంభించాలి

**సీపీఎం ఆధ్వర్యంలో సుజాతనగర్ సబ్‌స్టేషన్‌కు తాళాలు వేసి ధర్నా**

**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 27 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం సీతంపేట గ్రామపంచాయతీ పరిధిలోని కాసాని లక్ష్మీనగర్‌కు నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సౌకర్యాన్ని తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో సుజాతనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు, స్థానిక ప్రజలు సబ్‌స్టేషన్ గేటుకు తాళాలు వేసి ధర్నా నిర్వహించారు. ఇప్పటికే విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు విద్యుత్ సరఫరా ప్రారంభించక పోవడం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి కాసాని లక్ష్మీనగర్‌కు విద్యుత్ సరఫరా ప్రారంభించాలని, లేకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. ధర్నాలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యుత్ శాఖకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తన మాట నిలబెట్టుకున్న మంథని, బోయినిపేట కౌన్సిలర్ శ్రీలత-క్రాంతి




## రెండు నెలల వేతనంతో పేదలకు నిత్యావసరాల పంపిణీ

**మంథని, జూలై 27 ( వార్త సంధ్య ) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ మంథని పురపాలక సంఘం 6వ వార్డు (బోయిన్‌పేట్) కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి కుమార్ తన ఉదారతను చాటుకున్నారు. తనకు వచ్చిన రెండు నెలల కౌన్సిలర్ వేతనంతో స్థానిక నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచి ఆదర్శంగా నిలిచారు. బోయిన్‌పేట్ ప్రాంతానికి చెందిన నాలుగు నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారికి ఉచితంగా బియ్యం, కిరాణా సామగ్రి, ఇతర నిత్యావసర వస్తువులను ఆమె స్వయంగా పంపిణీ చేశారు.

**హామీ నెరవేర్చడమే నా ధ్యేయం**

ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీలత క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వార్డు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం, నాకు వచ్చే ప్రతి నెల కౌన్సిలర్ వేతనాన్ని ప్రజల సంక్షేమానికే ఖర్చు చేస్తానని చెప్పాను. ఆ మాటను ఆచరణలో నిలబెట్టుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉందని, వార్డు ప్రజల విశ్వాసమే నా అతిపెద్ద బలం అని, వారి నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని అన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి.. నిస్వార్థ సేవలో ఏ రాజకీయ పార్టీ మద్దతు లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ప్రజా ఆశీర్వాదంతో ఘన విజయం సాధించానని ఆమె గుర్తుచేశారు. పేద కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వారికి అండగా నిలవడం, నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. బోయిన్‌పేట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, నీతి, నిజాయితీ, నిస్వార్థ సేవతో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వార్డు ప్రముఖులు పాల్గొని కౌన్సిలర్ ఉదారతను అభినందించారు.

# జై యువ సరే... మన విద్యార్థులకు ఈ గతేంటి సీఎం రేవంత్

**సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దారుణ పరిస్థితులు బట్టబయలు**

**900 మంది విద్యార్థులకు సరిపోని తరగతి గదులు... లెక్చరర్ల కొరత... బాలురకు టాయ్లెట్లు లేవు... మూడేళ్లుగా వినియోగంలోకి రాని కొత్త భవనం... ప్రభుత్వ నిర్లక్ష్యంపై జై స్వరాజ్ పార్టీ ఆగ్రహం**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 27 : హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కాసాని శ్రీనివాసరావు గౌడ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా సంస్థల వాస్తవ పరిస్థితులను ప్రజల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో చేపట్టిన పరిశీలన కార్యక్రమంలో భాగంగా ఈరోజు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను పార్టీ బృందంతో కలిసి ఆయన సందర్శించారు.కళాశాల పరిస్థితులను పరిశీలించిన అనంతరం మాట్లాడిన కేఎస్ఆర్ గౌడ, ప్రభుత్వ విద్యార్థులు చదువుకునే పరిస్థితులు చూస్తే హృదయం కలిచివేస్తోందన్నారు. ఒకవైపు ప్రభుత్వం విద్యాభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటుంటే, మరోవైపు ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు కనీస సౌకర్యాలు కూడా లేక అవస్థలు పడుతున్నారని విమర్శించారు. సుమారు 900 మంది విద్యార్థులు చదువుతున్న ఈ కళాశాలలో సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనేక లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో బోధన సక్రమంగా సాగడం లేదని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం నిర్మించిన కొత్త భవనం పూర్తై మూడేళ్లు గడిచినా, కాం ట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో ఇప్పటికీ కళాశాల వినియోగానికి అప్పగించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. కోట్ల రూపాయల ప్రజా ధనం వెచ్చించి నిర్మించిన భవనం ఖాళీగా ఉండగా, విద్యార్థులు మాత్రం ఇరుకైన గదుల్లో చదువుకోవాల్సి రావడం దురదృష్టకరమన్నారు. కళాశాలలో బాలురకు ఒక్క మరుగుదొడ్డి కూడా లేకపోవడం, బాలికలకు ఉన్న మరుగుదొడ్లు కూడా అవసరాలకు సరిపోకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని తెలిపారు. ఇది విద్యా ర్థుల ఆరోగ్యం, గౌరవం, విద్యా హక్కుపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోందన్నారు. కళాశాలకు కాంపౌండ్ వాల్ లేకపోవడంతో ఆకతాయిల సంచారం పెరిగిందని, తరగతులు జరుగుతున్న సమయంలోనే బయట వ్యక్తులు కళాశాల పరిసరాల్లో సిగరెట్లు తాగడం వల్ల అధ్యాపకులు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. రాత్రి వేళల్లో మద్యం సేవించి సీసాలు పగులగొట్టి వెళ్లడం వల్ల విద్యా వాతావరణం పూర్తిగా దెబ్బతింటోందన్నారు. ఇంకా విచారకరమైన విషయం ఏమిటంటే, కళాశాలకు ప్రహరీ గోడ నిర్మించేందుకు స్థానిక దాతలు ముందుకు వచ్చినప్పటికీ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడం. "అమ్మా పెట్టదు... అడుక్కు తిననీయదు" అన్నట్లు ప్రభుత్వ వ్యవహారం ఉందని ఆయన విమర్శించారు. విద్యాశాఖ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విద్యా సంస్థల పరిస్థితిపై వెంటనే స్పందించాలని, సరూర్‌నగర్ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కేఎస్ఆర్ గౌడ డిమాండ్ చేశారు. జై స్వరాజ్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, ఖాళీ అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తామని, పెండింగ్‌లో ఉన్న భవనాలను వెంటనే వినియోగంలోకి తీసుకొస్తామని, ప్రతి విద్యార్థికి నాణ్య మైన ప్రభుత్వ విద్య అందేలా సమగ్ర విద్యా సంస్కరణలు అమలు చేస్తామని కాసాని శ్రీనివాసరావు గౌడ హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థల పరి స్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే కార్యక్రమాన్ని జై స్వరాజ్ పార్టీ నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్య క్రమంలో జై స్వరాజ్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ జనగాం వెంకటేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రూ.46 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం..

### జవీ=ఖీ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



**చంద్రుగొండ, ప్రతినిధి జూలై 27( వార్త సంధ్య) :** ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, కుమ్మరిపాడు, గుట్టగూడెం, మామిళ్లగూడెం, ములకలపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ విస్తృతంగా పర్యటించారు. రూ.46 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించి, కొత్త పనులకు శంకు స్థాపనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులతో గృహప్రవేశాలు నిర్వహించారు. అలాగే రూ.5,33,500 విలువైన సిఎంఆర్‌యఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు పేదల సంక్షేమమే లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు.

## కొత్తగూడెం ఏరియా జీఎంకు ఘన వీడ్కోలు

### పదవీవిరమణ సందర్భంగా షాలెంరాజుకు ఆర్‌సీహెచ్‌పీ అధికారులు, ఉద్యోగుల, కార్మికుల సన్మానం



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 27 (వార్త సంధ్య) :** కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెంరాజు ఈ నెల 31న పదవీవిరమణ పొందనున్న సందర్భంగా సోమవారం ఉదయం ఆర్‌సీహెచ్‌పీ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి పదవీవిరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కొత్తగూడెం ఏరియా అభివృద్ధి, బొగ్గు ఉత్పత్తి పెంపు, కార్మిక సంక్షేమం, భద్రతా ప్రమాణాల అమలులో షాలెంరాజు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తూ, యాజమాన్యం -- కార్మికుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పరస్పర సహకారంతో పనిచేసే వాతావరణాన్ని కల్పించడం ద్వారా కొత్తగూడెం ఏరియా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని తెలిపారు. పదవీవిరమణ అనంతరం కూడా షాలెంరాజు సంపూర్ణ ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ, ఆయన సేవలు సింగరేణి కుటుంబానికి ఆదర్శంగా నిలుస్తాయని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (ఎస్) ఆర్‌సీహెచ్‌పీ హెచ్‌వోడి జె. లింగ, ఈఈ యశస్వి, ఎస్‌వో టు జీఎం గోవిందరాజు, ఏరియా ఇంజనీర్ రామకృష్ణ, ఆఫీస్ పీఓఏ పి. వీరభద్రమ్మ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అనిల్, యోగేంద్రనాథ్, అనూష, ఎఐటీయూసీ సహాయ కార్యదర్శి జె. గట్టయ్య, నాయకులు ఎం. సురేందర్, యు. శివదర్శన్, ఎస్. నాగేశ్వరరావు, ఆర్. మురళి, జి. రాంబాబు, టి. రమేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు కే. కుమారస్వామి, ఎస్. సాంబశివరావు, సమ్మయ్య, బీఎంఎస్ నాయకుడు రవి, హెచ్ఎంఎస్ నాయకుడు పూర్ణతో పాటు ఆర్‌సీహెచ్‌పీ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్ర గ్రంథాలయం లో వన మహోత్సవం--శ్రమదానం

### పాల్గొన్న గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 27 (వార్త సంధ్య):** జిల్లా కేంద్ర గ్రంథాలయం, భద్రాద్రి కొత్తగూడెంలో సోమవారం సాయంత్రం గ్రంథాలయ ఆవరణలో వన మహోత్సవం మరియు శ్రమదానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయ ఆవరణలో శ్రమదానం నిర్వహించి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలు, విషపురుగుల బారిన పడకుండా ఆరోగ్యంగా జీవించవచ్చని విద్యార్థినీ, విద్యార్థులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, కాలుష్యం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ క్రమం తప్పకుండా మొక్కలు నాటి, 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు అందుకున్న కె.ఎన్. రాజశేఖర్ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో మరింత ఎక్కువగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-2 గ్రంథపాలకురాలు సూరేపల్లి లలిత కుమారి, గ్రంథపాలకురాలు జీ. మణి మృదుల, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై కొవ్వొత్తుల నిరసన

### విద్యార్థుల మరణాలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

### సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టేబోయిన శ్రీనివాస్




**గార్ల, జూలై 27 (వార్తా సంధ్య):** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో ప్రాణాలు కోల్పోయిన 21 మంది విద్యార్థులకు నివాళులర్పిస్తూ గార్ల మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద సోమవారం సాయంత్రం సీపీఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కామ్రేడ్ కట్టేబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థి ఉద్యమం, ప్రజాస్వామ్యం సాధించిన విజయమని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు పాశవికంగా లాఠీచార్జి చేయడాన్ని ఖండిస్తూ, బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నీట్ పరీక్షను రద్దు చేసి, ఆయా రాష్ట్రాలకు ప్రవేశ పరీక్షలు నిర్వహించుకునే స్వేచ్ఛ కల్పించాలని, దేశ విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సమితి సభ్యులు కట్టేబోయిన పిచ్చయ్య, భూక్య హరినాయక్, ధరావత్ వీరన్న, లావుడియా భీముడు, బాదం రాజేష్ పాల్గొన్నారు. సంఘీభావంగా జానీ మియా, ధరావత్ బాబురావు, సేట్ రామ్ తదితరులు హాజరై నిరసనకు మద్దతు తెలిపారు.

# సీతారామ ప్రాజెక్టు రూపురేఖలు మార్చొద్దు..

### రైతులకు సాగునీరు అందించాలి

### బీఆర్ఎస్ పార్టీ నాయకులు గిరిబాబు

**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 27 (వార్త సంధ్య) :** సీతారామ ప్రాజెక్టు అసలు రూపురేఖలను మార్చకుండా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు లకావత్ గిరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలూరుపాడు మండల కేంద్రంలోని అనంతారం గ్రామపంచాయతీలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు యదలపల్లి వీరభద్రం నివాసంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో రూ.13 వేల కోట్ల వ్యయంతో సీతారామ ప్రాజెక్టును చేపట్టారని,



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు రూపురేఖలను మార్చి జూలూరుపాడు నుంచి ఏన్కూర్ సాగర్ కాలువకు అనుసంధానం చేసి నీటిని ఆంధ్ర ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ చర్యను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. జూలూరుపాడు, ఏన్కూర్, కారేపల్లి, వైరా, కొణిజర్ల ప్రాంతాల రైతులకు సాగునీరు అందకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. చెరువులు, కుంటలను నింపుతామని ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించారు. జూలూరుపాడు మండలంలో సుమారు 25 వేల ఎకరాల సాగుభూమికి నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎల్‌నినో ప్రభావంతో పాటు యూరియా కొరత కూడా రైతుల సమస్యలను మరింత పెంచుతోందన్నారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అమలు చేసి ప్రతి రైతుకు, ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం అవసరమైతే రానున్న రోజుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చాపలమడుగు రామ్మూర్తి, యదలపల్లి వీరభద్రం, తాళ్లూరి రామారావు, పోతురాజు రామారావు, బండారి వెంకయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తన మాట నిలబెట్టుకున్న మంథని, బోయినిపేట కౌన్సిలర్ శ్రీలత-క్రాంతి

### రెండు నెలల వేతనంతో పేదలకు నిత్యావసరాల పంపిణీ

**మంథని, జూలై 27 ( వార్త సంధ్య ) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ మంథని పురపాలక సంఘం 6వ వార్డు (బోయిన్‌పేట్) కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి కుమార్ తన ఉదారతను చాటుకున్నారు. తనకు వచ్చిన రెండు నెలల కౌన్సిలర్ వేతనంతో స్థానిక నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచి ఆదర్శంగా నిలిచారు. బోయిన్‌పేట్ ప్రాంతానికి చెందిన నాలుగు నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారికి ఉచితంగా బియ్యం, కిరాణా సామగ్రి, ఇతర నిత్యావసర వస్తువులను ఆమె స్వయంగా పంపిణీ చేశారు.

#### హామీ నెరవేర్చడమే నా ధ్యేయం

ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీలత క్రాంతి కుమార్ మాట్లాడుతూ



ఎన్నికల సమయంలో వార్డు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం, నాకు వచ్చే ప్రతి నెల కౌన్సిలర్ వేతనాన్ని ప్రజల సంక్షేమానికే ఖర్చు చేస్తానని చెప్పాను. ఆ మాటను ఆచరణలో నిలబెట్టుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉందని, వార్డు ప్రజల విశ్వాసమే నా అతిపెద్ద బలం అని, వారి నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని అన్నారు.

#### స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి.. నిస్వార్థ సేవలో

ఏ రాజకీయ పార్టీ మద్దతు లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ప్రజా ఆశీర్వాదంతో ఘన విజయం సాధించానని ఆమె గుర్తుచేశారు. పేద కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వారికి అండగా నిలవడం, నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. బోయిన్‌పేట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, నీతి, నిజాయితీ, నిస్వార్థ సేవతో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వార్డు ప్రముఖులు పాల్గొని కౌన్సిలర్ ఉదారతను అభినందించారు.

## ఈ-సిటీ మహేశ్వరం పారిశ్రామిక పార్కులలో పలు పరిశ్రమలను సందర్శించిన సి.ఎస్ సంజయ జాజు

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)జూలై 27 :** ఈ-సిటీ లోని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ను, ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ, అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమ, మంఖాల్ పారిశ్రామిక పార్క్ ను సందర్శించి, ఎం/ఎస్. చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నేడు ఉదయం సందర్శించారు. సి.ఎస్ తో పాటు టి.జి.ఐ.ఐ.సి. వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశాంకతో పాటు సీనియర్ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ముందుగా, మెసర్స్ ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. ఈ-సిటీలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఈ సంస్థ సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారీచేస్తోంది. రూ.1,240 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమలో ప్రస్తుతం 1,200 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అనంతరం ఎం/ఎస్. అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమను సీ.ఎస్ సందర్శించారు. ఈ సంస్థ 4 ఎకరాల విస్తీర్ణంలో ఈ-సిటీలో ఉన్న ఈ పరిశ్రమ హైటెక్ రక్షణ ఎలక్ట్రానిక్స్, శాటిలైట్ పేలోడ్ వ్యవస్థలు, గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రధానంగా చేపడుతోంది. రూ.59.22 కోట్ల పెట్టుబడితో ఉన్న ఈ సంస్థలో 400 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా, మంఖాల్ పారిశ్రామిక పార్క్ ను సందర్శించి, మెసర్స్ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్రమను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందర్శించారు. . ఈ సంస్థకు ప్రారంభంలో 1,20,881 చదరపు మీటర్లు (29.87 ఎకరాలు) విస్తీర్ణం గల భూమి బీఓపీపీ బీఓపీఈటీ ఫిల్మ్ తయారీ యూనిట్ స్థాపన కోసం కేటాయించారు. . ఇందులో కోటింగ్, మెటలైజింగ్, స్లిట్టింగ్ మరియు రీసైక్లింగ్ ఉత్పత్తులు జరుగుతాయి. కాగా, తమకు . కేటాయించిన స్థలంలో ఈ చిరిపాల్





పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ సంస్థ తన తయారీ యూనిట్‌ను విజయవంతంగా నెలకొల్పి, ప్రాజెక్టుతో పాటు విస్తరణ ప్రాజెక్టును కూడా పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ యూనిట్ వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ రూ.284.02 కోట్ల పెట్టుబడితో 500 మందికి ఉపాధి కల్పిస్తోంది. అనంతరం, మహేశ్వరం జనరల్ పార్క్ లోని మెసర్స్ విప్రో ఎంటర్‌ప్రైజెస్ (ప్రైవేట్) లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. ఈ సంస్థకు 1,21,410 చదరపు మీటర్లు (30 ఎకరాలు) విస్తీర్ణంలో భూమి కేటాయి ంచారు. ప్రస్తుతం ఈ యూనిట్ రూ.17,434 లక్షల పెట్టుబడితో వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ 331 మందికి ఉపాధి కల్పిస్తోంది. చివరిగా ఎం/ఎస్. మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ను సంజయ్ జాజు



సందర్శించారు. ఈ సంస్థకు మహేశ్వరం జనరల్ పార్క్‌లోని మొత్తం 14,973 చదరపు మీటర్లు (3.7 ఎకరాలు) విస్తీర్ణంలో భూమి అత్యాధునిక రత్నాలు, ఆభరణాల తయారీ యూనిట్ స్థాపన కోసం కేటాయించారు. ఈ సంస్థకు కేటాయించిన స్థలంలో తయారీ యూనిట్‌ను విజయవంతంగా ఏర్పాటు చేసి విస్తరణ ప్రాజెక్టులను పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ యూనిట్ రూ.37,405 లక్షల పెట్టుబడితో వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ 2,782 మందికి ఉపాధి కల్పిస్తోంది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కల్పనలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందిస్తూ, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి మరింత వేగం తీసుకురావాలనిసీ.ఎస్ సంజయ్ జాజు అధికారులను కోరారు.

# భారీ ప్రమాదానికి ఆహ్వానం పలుకుతున్న గోతులు...

- ప్రమాదాలకు నిలయంగా అంజనాపురం -జింకలగూడెం మార్గం
- రోజూ వేలాది వాహనాల రాకపోకలు..
- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం
- గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న పట్టింపు లేదు




**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 26 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని అంజనాపురం -- జింకలగూడెం ప్రధాన రహదారిపై ఉన్న సీతారామ ప్రాజెక్టు కెనాల్ బ్రిడ్జి ప్రస్తుతం అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉండటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడెం నుండి భద్రాచలం మీదుగా ఛత్తీస్‌గఢ్, రాజమండ్రి తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన జాతీయ ప్రాధాన్యం కలిగిన రహదారిలో భాగమైన ఈ బ్రిడ్జి ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. బ్రిడ్జిపై భారీ గోతులు ఏర్పడటం, కాంక్రీట్ పూర్తిగా దెబ్బతినడం, ఇనుప రాడ్లు బయటకు కనిపించడం వల్ల ప్రతిరోజూ వేలాది మంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రహదారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యంత రద్దీగా ఉండే మార్గాల్లో ఒకటి. సింగరేణి ప్రాంతాలు, భద్రాచలం దేవస్థానం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, తూర్పు గోదావరి జిల్లా వైపు వెళ్లే ప్రయాణికులు, సరుకు రవాణా వాహనాలు, ప్రభుత్వ బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్, లారీలు, ట్రాక్టర్లు, అంబులెన్సులు, స్కూల్ బస్సులు, ద్విచక్ర వాహనాలు రోజంతా ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరం వాహనాల రద్దీ కొనసాగుతున్నప్పటికీ, బ్రిడ్జి పరిస్థితిని పట్టించుకునే నాథుడే లేకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జిపై పలుచోట్ల కాంక్రీట్ పూర్తిగా ఊడిపోయి లోపల ఉన్న ఇనుప రాడ్లు బయటకు వచ్చాయి. అనేక చోట్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో వాహనాలు తీవ్ర కుదుపులకు గురవుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గోతులను తప్పించుకునే క్రమంలో అదుపు తప్పి కిందపడుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని



స్థానికులు చెబుతున్నారు. భారీ వాహనాలు బ్రిడ్జిపైకి ఎక్కిన ప్రతిసారీ బ్రిడ్జి కంపిస్తున్నట్లు అనిపిస్తోందని, దీనివల్ల ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారని వాహనదారులు పేర్కొంటున్నారు. వర్షాకాలం కావడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. గోతుల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాటి లోతు వాహనదారులకు కనిపించడం లేదు. రాత్రి సమయంలో తగినంత లైటింగ్ లేకపోవడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల కొత్తగా వచ్చే వాహనదారులు ఒక్కసారిగా గోతుల్లో పడిపోతూ ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. ఇప్పటికే అనేక చిన్నపాటి ప్రమాదాలు జరిగినప్పటికీ అధికారులు స్పందించకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ మార్గంలో ప్రతిరోజూ జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు కూడా ప్రయాణిస్తుంటారు. అయినప్పటికీ బ్రిడ్జి దుస్థితిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని ప్రజలు అంటున్నారు. సంబంధిత శాఖల దృష్టికి పలుమార్లు సమస్యను తీసుకెళ్లినా కేవలం హామీలకే పరిమితమైందే తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించలేదని స్థానికులు వాపోతున్నారు. స్థానిక ప్రజల కథనం ప్రకారం, గత కొంతకాలంగా బ్రిడ్జి పరిస్థితి క్రమంగా దిగజారుతున్నప్పటికీ అధికారులు కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టలేదు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రాత్రి సమయంలో రిఫ్లెక్టర్లు అమర్చడం వంటి కనీస భద్రతా చర్యలు కూడా చేపట్టకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు విమర్శిస్తున్నారు. మరోవైపు త్వరలో గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో ఈ రహదారిపై వాహనాల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులతో పాటు గోదావరి పుష్కరాలకు హాజరయ్యే లక్షలాది మంది యాత్రికులు ఈ మార్గాన్ని వినియోగించే అవకాశముంది. ఇప్పటికే శిథిలావస్థకు చేరుకున్న ఈ బ్రిడ్జిపై భారీ ట్రాఫిక్ పెరిగితే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. "ఎవరికి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతి రోజు ఈ బ్రిడ్జిపై ప్రయాణించే సమయంలో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి అమాయకుల ప్రాణాలు పోయిన తర్వాతే అధికారులు స్పందిస్తారా?" అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత శాఖలు వెంటనే స్పందించి ఈ బ్రిడ్జిని పూర్తిస్థాయిలో పరిశీలించి అత్యవసర మరమ్మతులు చేపట్టాలని, అప్పటి వరకు భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని వారు కోరుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాలు కూడా ఈ సమస్యను అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. బ్రిడ్జి బలాన్ని నిపుణులతో పరీక్షించి అవసరమైతే పునర్నిర్మాణం చేపట్టాలని, తాత్కాలిక మరమ్మతులతో కాలయాపన చేయకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సీతారామ కెనాల్ బ్రిడ్జిపై వెంటనే ప్రత్యేక దృష్టి సారించి అత్యవసర నిధులు విడుదల చేసి మరమ్మతులు చేపట్టాలని, గోదావరి పుష్కరాల నాటికి పూర్తిస్థాయిలో ప్రయాణానికి అనుకూలంగా తీర్చిదిద్దాలని అంజనాపురం, జింకలగూడెం, బూర్గంపాడు మండల ప్రజలతో పాటు ఈ మార్గంలో నిత్యం ప్రయాణించే వేలాది మంది వాహనదారులు ప్రభుత్వాన్ని ముక్తకంఠంతో కోరుతున్నారు. ప్రాణనష్టం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదాన్ని ముందుగానే నివారించడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని, ఇకనైనా అధికారులు మేల్కొని తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## కెపిహెచ్‌బి టూసానగర్‌లో ఇంటెలిజెన్స్ విద్యార్థి అదృశ్యం



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ, తూసానగర్‌లో ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీసుల వివరాల ప్రకారం.. తూసానగర్‌కు చెందిన శ్రీ. చంద్రయ్య (వయస్సు 50, జనరల్ స్టోర్ వ్యాపారి) కుమారుడు శంకర్ (వయస్సు 19) డిగ్రీ చదువుతున్నాడు. కాగా, అదివరం రాత్రి అర్ధరాత్రి దాటాక తెల్లవారుజామున సుమారు 03:30 గంటల ప్రాంతంలో శంకర్ కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఉదయం లేచి చూసేసరికి కుమారుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన తండ్రి చంద్రయ్య పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శంకర్ ఆచూకీ తెలిసినవారు స్థానిక పోలీసులను సంప్రదించాలని అధికారులు కోరారు.

## మేడ్చల్‌ద్చల్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా నూతన పదాధికారులకు ఘన సన్మానం



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా నూతన పదాధికారులు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా జిల్లా ఓబీసీ మోర్చా పదాధికారులు అత్కరి మల్లేష్, సతీష్ గౌడ్, పందుగ రేణుక, తేజస్విని, శ్రవణ్ కుమార్, దిలీప్‌లను రాజేశ్వరరావు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. బీజేపీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ సముచిత గుర్తింపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, జిల్లా అధ్యక్షులు శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో బీసీ వర్గాల అభివృద్ధి కోసం క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా 'ది న్యూ బ్రెజ్జా' ఆవిష్కరణ



వార్తా సంధ్య కూకట్‌పల్లి : బాలానగర్‌లోని మారుతి సుజుకి వరుణ్ మోటార్స్‌లో నిర్వహించిన "ది న్యూ బ్రెజ్జా -- కింగ్ ఆఫ్ ౹ాఖఎం" గ్రాండ్ లాంచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు మరియు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన నూతన మారుతి సుజుకి బ్రెజ్జా కారును ఆవిష్కరించి షోరూమ్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. భారత ఆటోమొబైల్ రంగంలో మారుతి సుజుకి సంస్థ వినియోగదారుల నమ్మకాన్ని చూరగొంటూ నాణ్యమైన సేవలను అందిస్తోందని ఆయన కొనియాడారు. అత్యాధునిక సాంకేతికత, అద్భుతమైన భద్రతా ప్రమాణాలు, సౌకర్యాలతో రూపొందించిన ఈ కొత్త బ్రెజ్జా మార్కెట్లో విశేషమైన ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.సి. రాజు, జీఎం కృష్ణ, ఏజీఎం , బ్రాంచ్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు.

## 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్

### రైతులందరూ తప్పనిసరిగా పాల్గొని శాస్త్రవేత్తల సూచనలు పొందాలి -- వ్యవసాయ సంచాలకులు బి. గోపి, ఐఏఎస్




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 27.** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రైతు నేస్తం' కార్యక్రమం రేపు (28 జూలై 2026) 100వ ఎపిసోడ్‌కు చేరుకోనుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ప్రారంభమైన ఈ వినూత్న కార్యక్రమం గత రెండున్నర సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా రైతులకు అత్యంత ఉపయోగకరమైన వేదికగా నిలిచింది. రాష్ట్రంలోని రైతు వేదికలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో అనుసంధానం చేసి, పంటల సాగు, వాతావరణ పరిస్థితులు, చీడపీడల యాజమాన్యం, పోషక నిర్వహణ, ప్రత్యామ్నాయ పంటలు, నూతన సాంకేతిక పరిజ్ఞానాలపై శాస్త్రీయ సూచనలను రైతులకు ఎప్పటికప్పుడు అందిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది రైతులు నిపుణుల సలహాలను పొందుతూ శాస్త్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. రైతులకు అవసరమైన సాంకేతిక సమాచారం నేరుగా చేరవేసే సమర్థవంతమైన వేదికగా 'రైతు నేస్తం' విశేష ఆదరణ పొందిందని వ్యవసాయ సంచాలకులు బి. గోపి, ఐఏఎస్ తెలిపారు. 100వ ఎపిసోడ్ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని రైతు వేదికలలో కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేయనున్నందున రైతులందరూ తమ సమీప రైతు వేదికకు హాజరై శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సంచాలకులు కోరారు.

## తెలంగాణ రాష్ట్ర శాసనసభ ను సందర్శించిన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ శ్రీ సతీష్ మహానా , వారి సతీమణి శ్రీమతి అనితా మహానా .

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 27** : స్వాగతం పలికి, ఉత్తరప్రదేశ్ స్పీకర్ దంపతులను శాలువా, పుష్ప గుచ్ఛంతో సన్మానించి మెమెంటో బహుకరించిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ . అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్ లో సమావేశమైన ఇరువురు స్పీకర్లు తెలంగాణ, ఉత్తరప్రదేశ్ శాసనసభల నిర్వాహణపై ముచ్చటించారు. కౌన్సిల్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధి.. నీట్ కుంభకోణంపై పోరు

### అభివృద్ధి పనులకు శ్రీకారం.. విద్యార్థుల న్యాయం కోసం కొవ్వొత్తుల ర్యాలీ

### కొత్తగూడెంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బిజీబిజీ కార్యక్రమాలు




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 27 (వార్త సంధ్య) :** కొత్తగూడెం పట్టణ అభివృద్ధి పనులకు ఊతమిస్తూ, మరోవైపు నీట్ పేపర్ లీకేజీ కుంభకోణంపై విద్యార్థుల న్యాయం కోసం చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొంటూ కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సోమవారం బిజీబిజీగా గడిపారు. మొదటగా పట్టణంలోని భజన మందిర్ రోడ్డులో డీఎంఎఫ్ నిధులతో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన సెంట్రల్ డివైడర్, టూ వే రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. స్విచ్ ఆన్ చేసి వీధి దీపాలను వెలిగించిన అనంతరం మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని తెలిపారు. రోడ్డు



విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు తగ్గి, రాత్రివేళల్లో ప్రమాదాల నివారణకు సెంట్రల్ లైటింగ్ ఎంతో దోహదపడుతుందని చెప్పారు. పోస్టాఫీస్ సెంటర్ నుంచి గోధుమవాగు వరకు సెంట్రల్ డివైడర్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు పేర్కొంటూ, పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులను దశలవారీగా మోడల్ రోడ్లుగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. మంజూరైన ప్రతి పనిని నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువు లోగా పూర్తి చేసి ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని అధి కారులకు సూచించారు. అనంతరం నీట్ పేపర్ లీకేజీ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు నివాళులర్పిస్తూ సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ సెంటర్ నుంచి ఓల్డ్ డిపో వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యే కూనంనేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన నీట్ కుంభ కోణానికి కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజనులు చేపట్టిన ఉద్యమానికి తలవంచి కేంద్రం స్పందించాల్సి వచ్చిందన్నారు. నీట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి వైద్య విద్య ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఉద్యమ విరమణ సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విధానాలను ప్రజాస్వామ్యవాదులంతా వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. ఈ రెండు కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదన, పంపిణీ, వివిధ విధ్యుత్ ఉతిపాదన సంస్థల పనితీరు, సింగరేణి సంస్థ కార్యకలాపాలపై సంబంధిత ఉన్నతాధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సమీక్ష సమావేశం నిర్వహించారు.



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 27. : ఈ సమా వేశంలో సింగరేణి సి.ఎం.డి బుద్ధ ప్రకాష్ జ్యోతి, టాకో సి.ఎండి కృష్ణ భాస్కర్ జెన్ –కో సి.ఎం.డి హరీష్, ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ పాటిల్ లు పాల్గొన్నారు.

### సత్తుపల్లి నియోజకవర్గంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెడమర్తి రవి పర్యటన బేతపల్లి లో చెన్నకేశవరావు కుటుంబాన్ని ప్రదర్శించిన పిడమర్తి రవి



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 27:** తల్లాడ దుగ్గల రఘుపతి రెడ్డి దశదిన కార్యక్రమంలో పాల్గొని పూలమాలవేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు తల్లాడ మట్టమ్మ హోటల్ రాజుగారితో పలు విషయాల మీద మాట్లాడారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయ కులు మండల నాయకులు పలువురు పాల్గొన్నారు

# జర్నలిస్టుల హక్కుల కోసం ఢిల్లీలో టీడబ్ల్యూజేఎఫ్ ధర్నా

### జంతర్ మంతర్ వద్ద తెలంగాణ జర్నలిస్టుల నిరసన

### - కేంద్రానికి వినతిపత్రాల సమర్పణ

**న్యూఢిల్లీ, జూలై 27, వార్త సంధ్య :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తెలంగాణకు చెందిన జర్నలిస్టులు భారీ ధర్నా నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన "ఛలో పార్లమెంట్" పిలుపు మేరకు ఈ కార్యక్రమంలో ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఉపాధ్యక్షుడు లియాఖత్, సభ్యురాలు మాన్విక మిశ్రా, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, రాష్ట్ర నాయకులు కుంచం శ్రీనివాస్, కుడుతాడి బాపురావు, పొట్లపల్లి అశోక్ కుమార్ గౌడ్, కే. రమాదేవి, జగదీశ్వర్, పద్మనాభరావు, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు సానేం శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి నంబి పర్వతాలుతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పాత్రికేయులు ఢిల్లీ చేరుకుని ఉద్యమంలో పాల్గొన్నారు.

**వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు,**




**ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.**




టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాను ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) నాయకులు, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు మారూఫ్ రజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్య లను కేంద్ర ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాత్రికేయుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ జర్నలిస్టులు చేపట్టిన ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా ఉన్న మీడియా వర్గాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ధర్నాలో పాల్గొన్న జర్నలిస్టులు రైల్వే రాయితీ పాస్‌ల పునరుద్ధరణ, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం అమలు, జర్నలిస్టుల రక్షణ చట్టం, నేషనల్ మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై సుప్రీంకోర్టు తీర్పు పునఃసమీక్ష వంటి ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జర్నలిస్టులు కూడా ధర్నాకు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పాత్రికేయుడి హక్కులు, సంక్షేమం కోసం టీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం ఉద్యమిస్తుందని తెలిపారు. అనంతరం జర్నలిస్టుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లకు సమర్పించారు.

# జెన్-జీ నిరసనలకు హైదరాబాద్ యువత మద్దతు

### జంతర్‌మంతర్‌కు ఇక్కడి నుంచే ఫుడ్

### సామాజిక మాధ్యమాల్లో నినాదాలతో హోరు

### జంతర్‌మంతర్‌కు ఇక్కడి నుంచే ఫుడ్ డెలివరీలు




ఇందిరాపార్క్ వద్ద కొత్త పంథాలో ఎలుగెత్తిన 'జెన్ జీ' కుర్రాళు 'ఒక అన్యాయం నిన్ను ఆగ్రహంతో ఊగిపోయేలా చేయకుంటే నువ్వు ఇప్పటికే బానిసత్వాన్ని అంగీకరించినట్లుగా లెక్క' ఈ వాక్యం చదువుతుంటే శరీరం గగుర్పాటుకు గురవుతోందా జీవితాన్ని రంగరించి, సమాజంలోని మంచీచెడులను కాచివడబోసిన అనుభవజ్ఞులు ఎవరో రాసినట్లుగా అనిపిస్తోందా కానీ, నిత్యం సోషల్ మీడియాలో మునిగిపోతుంటారని, సమాజంపై బాధ్యత లేకుండా వ్యవహరిస్తుంటారని మంచీ, చెడుల విచక్షణ లేకుండా ఉంటారనే అపవాదును ఎదుర్కొనే జెన్-జీ కుర్రాళ్లు హైదరాబాద్ నగరంలో ఇటీవల సంధించిన అక్షర అస్త్రాలవి. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని, ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)ను ప్రక్షాళన చేయాలని, బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు తెలిపిన జెన్-జీ యూత్ అనుకున్నది ఎట్టకేలకు సాధించింది. టెక్నాలజీని, శాంతియుత నిరసన మార్గాలను అస్త్రాలుగా చేసుకుని కొత్త తరహా ఉద్యమాన్ని నడిపింది. విద్యార్థుల తల్లిదండ్రులు, సినీరంగ, క్రీడా ప్రముఖులు, సామాజికవేత్తలు, యువతీ, యువకులు తామున్నామంటూ ముందుకొచ్చారు. శాంతియుతంగా నిరసన తెలిపారు. దేశంలో అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొని ఉద్యమానికి నైతిక స్థైర్యాన్నిచ్చారు. ముఖ్యంగా ఐటీకి మారుపేరుగా మారిన హైదరాబాద్ నగరంలో యువత తమదైన శైలిలో పోరాట పటిమను చాటింది. దేశంలోని అన్ని ప్రాంతాలకు ఢిల్లీ నిరసనల ఉద్దేశం చేరేలా హైదరాబాద్ యువత సోషల్ మీడియాను ఆలంబనగా చేసుకుంది. సభలు, సమావేశాల్లో ప్రముఖులు, యువత మాట్లాడిన విషయాలను కొంతమంది యువకులు ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ వచ్చారు. తమ నిరసన గలాన్ని వినిపించేందుకు ఇంటర్నెట్‌ను ఆయుధంగా వాడుకుని పాప్ కల్చర్‌ను జోడించారు. జంతర్‌మంతర్‌లో పోరాడుతున్న యువత కోసం ఇక్కడి నుంచే ఆన్‌లైన్‌లో ఆహారాన్ని, వాటర్ బాటిల్స్, దుప్పట్లను ఈ-కామర్స్ వేదికల్లో ఆన్‌లైన్‌లో ఆర్డర్లు పెట్టి తమ సంఘీభావాన్ని చాటారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వేదికగా శుక్రవారం నిర్వహించిన ఆందోళనలో యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఒక మాస్క్, ఒక కాగితం స్పందించే గుండెను తీసుకుని సమావేశస్థలికి తరలివచ్చారు. ప్రభుత్వాల్లో ఉండే కేబినెట్‌ల కంటే ఉత్తమంగా ఉపయోగపడే క్యాబినెట్‌లు ఫర్నిచర్ దుకాణాల్లో లభిస్తున్నాయి వంటి పదునైన నినాదాలను ప్లకార్డులపై రాసుకొచ్చారు. యువత వేషధారణ, భావవ్యక్తీకరణ పూర్తిగా కొత్తగా అనిపించింది. నాటక ప్రదర్శనలతోపాటు పాటలు పాడుతూ పాలకుల వైఫల్యాలపైన వ్యంగ్యాస్త్రాలను సంధించారు. దేశానికి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు వాటిని దాటించే వారధిగా నిలుస్తామంటూ భరోసానిచ్చారు.

